
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 23 । నవంబర్ । 2023



నెట్‌బాల్‌లో విజయం
రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ అండర్ - 14, 19 బాలబాలికల పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. పలు పతకాలు సాధించారు. IIలో ▸



పంచారామాలకు కార్తీక శోభ
కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని పంచారామ క్షేత్రాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ముక్కంటి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. IIలో ▸



నేత్రపర్వం.. గ్రామోత్సవం
గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. IIలో ▸

న్యూస్‌రీల్

'నన్నయ'లో బీ ఫార్మసీ



ఫార్మసీ కళాశాల భవనం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చదివేందుకు వెబ్‌ఆప్షన్స్ పెట్టుకోవచ్చని వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నన్నయ్య ప్రాంగణంలో ఫార్మసీ కోర్సుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించిందని పేర్కొన్నారు. దీని ద్వారా ఇక్కడ ఫార్మసీ కోర్సులో చేరడానికి విద్యార్థులు వెబ్ ఆప్షన్ పెట్టుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. తమ కళాశాల ప్రాంగణంలో బీ ఫార్మసీకి నూతన భవనం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన ల్యాబొరేటరీలు, ఇతర వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 25 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని తెలిపారు.

9న ఐఆర్‌సీటీసీ పుణ్యక్షేత్ర యాత్ర
ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో వచ్చేనెల 9 నుంచి 17 మధ్య పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్టు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు 9న సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై విజయవాడ, ఏలూరు, రాజమండ్రి సామర్లకోట మీదుగా నడుస్తుందని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ క్షేత్రాలను సందర్శించవచ్చని తెలిపారు. టికెట్ ధరలు స్లీపర్ క్లాస్‌కు రూ.15,200, థర్డ్ ఏసీ రూ.24 వేలు, సెకండ్ ఏసీ రూ.31,500గా నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ సౌకర్యం ఉందని, మరిన్ని వివరాలకు విజయవాడ ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం బాలాజీ 82879 32312, ప్రవీణ్ 92814 95848 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డయల్ యువర్ డీపీటీఓకు విశేష స్పందన



ప్రజా రవాణా అధికారి ప్రసాద్

భీమవరం(ప్రకాశం చౌక్): ఇన్‌చార్జ్ జిల్లా ప్రజా రవాణా అధికారి (ఆర్టీసీ) ఎన్‌వీఆర్ ప్రసాద్ బుధవారం డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. జిల్లా నలుమూలల నుంచి ఆర్టీసీ సేవలపై కాల్స్ వచ్చాయి. నరసాపురం నుంచి హైదరాబాద్, కాకినాడ, విజయవాడ, పామూరు, రాజమహేంద్రవరం, కంచుస్తంభంపాలెం, అలాగే తణుకు నుంచి దొడ్డిపట్లకు, భీమవరం నుంచి రాజమహేంద్రవరం (వయా వేండ్ర), ఆచంట తదితర సర్వీసుల కోసం ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని ప్రసాద్ అన్నారు. అలాగే రిక్వెస్ట్ స్టాప్‌లు, సైకిల్ స్టాండ్‌లో చార్జీలు తదితరాలపై పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

వాలీబాల్ సెలెక్షన్స్



నన్నయ వర్సిటీ జట్టు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చేనెల 8 నుంచి తిరుపతిలో జరిగే దక్షిణ భారత అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టును స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఎంపిక చేశారు. సెలెక్షన్స్‌లో భాగంగా పోటీలు నిర్వహించగా జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు మొదటి, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను వర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. జి.ప్రసన్న జ్యోతి (గొల్లల మామిడాడ), పి.గౌతమి (గోపన్నపాలెం), కె.జయశ్రీ (జంగారెడ్డిగూడెం), జి.హేమదుర్గ (రాజమహేంద్రవరం), పి.రమ్య (తణుకు), పి.రమణి (గోపన్నపాలెం), బి.దిల్లేశ్వరి (జంగారెడ్డిగూడెం), టి.తులసి (గోపన్నపాలెం), వి.ప్రవల్లిక (జంగారెడ్డిగూడెం), యు.నాగదుర్గాభవాని (తణుకు), సీహెచ్ స్నేహ సంతోషి (రంపచోడవరం), వై.భూమిక (తణుకు) జట్టు సభ్యులుగా ఎంపికయ్యారు. స్టాండ్‌బై క్రీడాకారిణులుగా ఎస్.ప్రణీత (ఏలూరు), వి.మేఘన (ఏలూరు), సీహెచ్ రమాదేవి (కొయ్యలగూడెం), పి.తన్మయిశ్రీ (రంపచోడవరం) జట్టుకు ఎంపికయ్యారు. వీరిని సీఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ అభినందించారు. సీఆర్ఆర్ కళాశాల పీడీ సునీతమ్మ జట్టు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు.

దివ్యాంగులకు డిజిటల్ విద్య

- ఉమ్మడి జిల్లాలో 196 ట్యాబ్‌ల పంపిణీ
- దృష్టి, వినికిడి లోపాల విద్యార్థుల కోసం ప్రత్యేక యాప్‌లు
- ట్యాబ్‌ల వినియోగంపై సమగ్ర శిక్ష ద్వారా శిక్షణ
- దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



భీమవరంలో దివ్యాంగులకు ట్యాబ్‌లు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

కైకలూరు: దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. డిజిటల్ చదువుల నిమిత్తం ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబ్‌లను రెండు విడతలుగా అందించారు. తాజాగా భవిత కేంద్రాల్లో(ప్రత్యేకావసరాల పిల్లల వనరుల కేంద్రం) దివ్యాంగులకు అత్యాధునిక ట్యాబ్‌లను అందజేస్తున్నారు. దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్(ఐఈఆర్టీ), దివ్యాంగుల తల్లిదండ్రులకు ట్యాబ్‌ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

47 భవిత కేంద్రాల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 47 భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 28, పశ్చిమగోదావరి జిల్లాలో 19 ఉన్నాయి. రెండు జిల్లాల్లో ఆయా కేంద్రాల్లో మొత్తం 905 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఐఈఆర్టీలు 93 మంది ఉండగా, హైస్కూల్ స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్) బీఈడీ చేసిన ఉపాధ్యాయులు 48 మంది దివ్యాంగుల కోసం విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో దివ్యాంగులకు 196 ట్యాబ్‌లు, అలాగే పాఠాలు బోధించే ఐఈఆర్టీ, స్కూల్ అసిస్టెంట్లకు 113 ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది.

ఆధునిక సాంకేతికతతో..

దృష్టి, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లు అందిస్తున్నారు. అంధులు, పాక్షిక అంధులు, బదిరులు, పాక్షిక బదిరులకు వీలుగా టాక్ బ్యాక్ (ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబులిటి ఇన్‌ఎన్స్‌మెంట్ (దృష్టి లోపం ఉన్నవారికి చిన్నచిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి ఉపయోగించే యాప్), మిషన్ ఏఐ, 'ఎన్' విజన్ యాప్‌లు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే యాప్) వంటి పలు యాప్‌లను ట్యాబ్‌లో పొందిపర్చారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ప్రత్యేకావసరాల గల బాలబాలికలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దివ్యాంగులకు ట్యాబ్‌లను ఈనెల 15న పశ్చిమగోదావరి కలెక్టర్ ప్రశాంతి భీమవరంలో, 21న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఏలూరులో ప్రారంభించారు. ఇటీవల ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరాలను నిర్వహించారు. మండలానికి ఒక భవిత కేంద్రం చొప్పున ఏర్పాటుచేసి చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యం అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగ విద్యార్థికి ట్యాబ్ అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమగ్ర శిక్ష ద్వారా పట్టణంలోని భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థికి తన నివాసం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ట్యాబ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, అమ్మఒడి పథకాలను అమలు చేయడంతో పాటు ఉపకరణాలు, ట్యాబ్‌లు అందిస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ పీఎంఈకే జ్యోతి, ఐదో వార్డు ఇన్‌చార్జి కాకర్ల శ్రీను, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు కె.బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

	ఏలూరు జిల్లా	పశ్చిమ గోదావరి
కేంద్రాలు	28	19
చిన్నారులు	545	360
ట్యాబ్‌ల అందజేత	110	86
ఐఈఆర్టీలు	55	38
స్కూల్ అసిస్టెంట్, బీఈడీలు	26	22
సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ	63	50

దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



భవిత కేంద్రాల్లో విద్యార్థులకు సుమారు రూ.30 వేలకు పైగా విలువైన ట్యాబ్ అందిస్తున్నారు. వారికి సులభతరంగా అర్థమయ్యే రీతిలో ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చాం. అలాగే ఇప్పటికే బుద్ధిమాంద్యం గల దివ్యాంగులకు రూ.35 వేల విలువైన సీపీ చైర్లను పంపిణీ చేశాం. ట్యాబ్‌ల ద్వారా దివ్యాంగులు అధునిక సాంకేతికను అలవర్చుకుంటారు.

– బి.భాస్కరరాజు, ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్, ఏలూరు

ప్రభుత్వ మేలు మరువలేం



మా పాప ఝాన్సీ దేవీ కంటి సమస్యను ఎదుర్కొంటుంది. ప్రత్యేకావసరాల కేంద్రంలో శిక్షణ తీసుకుంటుంది. ఇప్పుడు ప్రభుత్వం దృష్టి లోపం ఉన్నవారు సైతం చక్కగా అర్థం చేసుకునేలా ట్యాబ్‌లను అందించారు. దివ్యాంగులపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. తల్లిదండ్రులకు కూడా శిక్షణ అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును ఎన్నటికీ మరువలేం.

– డి.శివపార్వతి, దివ్యాంగ విద్యార్థిని తల్లి, ఏలూరు

పక్కాగా కులగణన

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): సమగ్ర కులగణన సర్వేను పూర్తి అవగాహనతో చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కులగణన సర్వేపై సర్పంచ్‌లు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణన కేవలం సర్వే మాత్రమే అని, దీని ఆధారంగా కులధ్రువీకరణ పత్రాల జారీ, కులం మార్పు, సంక్షేమ పథకాల వర్తింపు జరగదన్నారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అంశాలపై ఈనెల 27 నుంచి వచ్చేనెల 10 వరకు జిల్లాలో కులగణన సర్వే నిర్వహిస్తామన్నారు. కులగణన సర్వే ఒక యాప్ ద్వారా మాస్టర్ డేటాతో సరిచూస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా సర్వే జరుగుతుందని, ఈ మేరకు సిద్ధం కావాలన్నారు. ముందుగానే వలంటీర్ల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించి అపోహలు తొలగించాలన్నారు. సర్వేలో కుటుంబసభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని, ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు అడగాల్సిన అవసరం లేదన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, ఎవరి కులం వారికే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే, వారిని బలవంతం చేయవద్దని, ఇది స్వచ్ఛందమేనని స్పష్టం చేశారు. సమస్యలు, సందేహాలు ఉంటే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేసినప్పుడు వారి ఈకేవైసీ తప్పనిసరిగా చేస్తారన్నారు. కుటుంబ సర్వే పూర్తిచేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్‌మిట్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు..

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 33, 34 వార్డుల్లో నిర్మించిన రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో తాను తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. ఆ సమయంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు దేశంలోనే రెండోవదిగా విరాజిల్లుతున్న హార్టీకల్చర్ యూనివర్సిటీని స్థాపించామన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ సహకారంతో అంతకు మించిన అభివృద్ధిని సాధించామన్నారు. పట్టణంలోని అంతర్గత రోడ్ల నిర్మాణంతోపాటు పట్టణ శివారు ప్రాంతంలో ఏర్పాటుచేసిన లేఅవుట్లలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ డి.మురళీకృష్ణ, డీఈ నాయక్, ఏఈ ఎస్.వెంకటేశ్వరరావు, నాయకులు కర్రి భాస్కరరావు, చామన సూర్యచంద్రరావు, చెన్నా జనార్దన్, బొద్దాని శ్రీనివాస్, అడ్డాల నర్సింహరావు, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, యజ్జల రాంబాబు, కేసన అశోక్ గురజాడ బ్రహ్మాజి, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, పత్సమట్ల సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



మర్యాద పూర్వక భేటీ
తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

-సాక్షి, అమరావతి

రుణాల మంజూరుకు సహకరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): లబ్ధిదారులకు విరివిగా రుణాలు మంజూరు చేసి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో బ్యాంకర్లు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా దరఖాస్తుకు అర్హత లేకపోతే కారణాలతో తిరస్కరించాలి తప్ప పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని రాష్ట్రంలో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, ఇప్పటివరకు 20,816 దరఖాస్తులను అందుకోగా 2,780 దరఖాస్తులను ఆమోదించామన్నారు. జిల్లాలో 89 వేల సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయగా 40 వేల సీసీఆర్‌సీ కార్డుదారులకు రూ.297 కోట్ల పంట రుణాలు మంజూరు చేశారన్నారు. 16 వేల మంది రైతులకు రూ.12.50 కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామన్నారు. అమూల్‌కు పాలును అందించే రైతులకు రుణాలను మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. ఆర్‌బీఐ ఏజీఎం ఆర్కే హనుమకుమారి మాట్లాడుతూ రుణాల మంజూరు, బకాయిలను రాబట్టడంలో బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ పి.సంగీతకుమారి మాట్లాడారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, నాబార్డ్ డీడీ టి.అనిల్‌కాంత్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సీదిరి అప్పలరాజు



నరసాపురంలో ఫిష్ మార్కెట్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. నరసాపురంలో రూ.1.50 కోట్లతో ఆధునీకరించిన కుండల బజార్ వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్రంలోని అన్ని తీరప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి మాట్లాడుతూ స్థానికంగా చేపల మార్కెట్ శిథిలం కావడంతో సరైన వసతులు లేక చేపల వ్యాపారం సాగించే వారు ఇబ్బంది పడేవారన్నారు. కొనుగోలుదారులకు కూడా ఇబ్బందిగా ఉండేదన్నారు. దీంతో రూ.1.50 కోట్లతో చేపల మార్కెట్‌ను అన్ని వసతులతో ఆధునీకరించామని చెప్పారు. పార్కుల రోడ్డులో ఉపయోగంలో లేని ఫిష్ మార్కెట్ భవనాన్ని మత్స్యకారుల కల్యాణ మండపంగా తీర్చిదిద్దనున్నామన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, మత్స్యకార సొసైటీల సంఘం జిల్లా అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

అగ్నికుల క్షత్రియ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుమాని నాగరాజు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తానని అన్నారు. నరసాపురంలో మత్స్య విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు పొందిన తొలిబ్యాచ్ విద్యార్థులకు బుధవారం స్థానిక కాటన్‌పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు ప్రవేశ పత్రాలు అందజేశారు. అలాగే ఆక్వా యూనివర్సిటీ కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై నాగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన్ను మంత్రి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి తదితరులు అభినందించారు. నరసాపురం ఆర్డీఓ అత్యుత్ అంబరీష్, మునిసిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్‌పర్సన్ బర్రి లీల, జిల్లా మత్స్యకార సొసైటీల సంఘం అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, పార్టీ నేతలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న తిరుమాని నాగరాజు

ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు



తీర్మానపత్రాన్ని జిల్లా ఫైర్ అధికారికి అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పోడూరు: ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు 18 సెంట్ల స్థలాన్ని పంచాయతీ కేటాయించింది. సంబంధిత తీర్మాన పత్రాన్ని బుధవారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఫైర్ అధికారి జి.శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల విజ్ఞప్తి మేరకు ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు కొంతకాలంగా కృషి చేస్తున్నామన్నారు. ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, స్టేషన్ ఏర్పాటైతే ఫైర్‌ఇంజన్‌ను అందుబాటులో ఉంచడం ద్వారా అగ్నిప్రమాదాల నష్ట తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ఇటీవల ఆచంట మండలం వల్లూరుతోటలో గ్యాస్ సిలెండర్ పేలుడు ఘటనలో వృద్ధ దంపతులు ప్రాణాలు కోల్పోవడం, మరో ముగ్గురికి తీవ్రగాయాలవ్వడం విచారకరమన్నారు. ప్రమాద బాధితులను ఆదుకునేలా కృషి చేస్తున్నామన్నారు. ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య, సర్పంచ్ కోట సరోజిని, పంచాయతీ కార్యదర్శి కె.నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు, బూత్ కన్వీనర్ కుక్కల కిరణ్ పాల్గొన్నారు.

సంప్రదాయ కూరగాయల దినోత్సవం



తాడేపల్లిగూడెం: సంప్రదాయ కూరగాయల్లో పలు పోషక విలువలున్నాయని, అలాంటి జాతులను సంరక్షించుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకీ రామ్ పిలుపునిచ్చారు. బుధవారం వర్సిటీలో సంప్రదాయ కూరగాయల దినోత్సవం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అంతరించిపోతున్న సంప్రదాయ కూరగాయల రకాలను పరిరక్షించుకోవాలన్నారు. దొమ్మేరు వంగ, పెన్నాడ వంగ, దుర్గాడ మిరప, చిత్రాడ బీర వంటి స్థానిక కూరగాయల రకాల విశిష్టత గురించి వివరించారు. 127 దత్తత గ్రామాల్లో కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశామన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులను వర్సిటీ ఉత్పత్తి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ నారం నాయుడు, డీఎస్ఏ సలోమి, వివిధ గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచారామాలకు కార్తీక శోభ

- భీమవరం, పాలకొల్లుకు పోటెత్తుతున్న భక్తులు
- ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ, తెలంగాణ నుంచి భక్తజనం
- ఆర్టీసీ పంచారామ స్పెషల్, ప్రత్యేక బస్సులు, వాహనాల్లో రాక
- దర్శన వేళల పొడిగింపు, ప్రత్యేక ఏర్పాట్లు

సాక్షి, భీమవరం: భీమవరంలో సోమారామం, పాలకొల్లులో క్షీరారామంతో పశ్చిమగోదావరి జిల్లా కార్తీకశోభను సంతరించుకుంది. ముక్కంటి దర్శనం కోసం ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలతో పాటు తెలంగాణ నుంచి రెండు శైవక్షేత్రాలకు భక్తజనం పోటెత్తుతోంది. గత సోమవారం సుమారు 35 వేల మందికి పైగా భక్తులు స్వామివార్లను దర్శించుకుంటే యాత్రికులు 25 వేలకు పైనే ఉంటారని ఆలయ అధికారులు తెలిపారు.

పంచారామాల్లో ఒకటైన శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి భీమవరం పట్టణంలోని గునుపూడిలో ఉంది. ఇక్కడి శివలింగం చంద్రప్రతిష్టగా ప్రతీతి. 9వ శతాబ్దంలో తూర్పుచాళుక్య రాజు చాళుక్య భీముడు ఆలయాన్ని నిర్మించాడు. అమవాస్య రోజున గోధుమ, నలుపు వర్ణంలో, పౌర్ణమికి శ్వేతవర్ణంలోకి మారడం ఇక్కడి శివలింగం ప్రత్యేకత. పాలకొల్లులోని శ్రీరారామలింగేశ్వరస్వామి ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి. పంచ లింగాలు, పంచ శిఖరాలు, పంచ నందులు, పంచ గణపతులు, పంచ అమ్మవార్లు ఇలా ఈ ఆలయంలో అన్నీ ఐదుతో ముడిపడి ఉంటాయి. స్వామి దర్శనానికి ఐదు ద్వారాలు దాటి వెళ్లాలి. తొమ్మిది అంతస్తులతో 120 అడుగుల ఎత్తయిన రాజగోపురం ఉంది.

పెరిగిన యాత్రికుల రద్దీ

కార్తీక మాసంలో రెండు ఆలయాలు పంచారామ యాత్రికులతో కిటకిటలాడతాయి. 14 నుంచి కార్తీక పూజలు ప్రారంభం కాగా భక్తుల రద్దీ పెరిగింది.


భీమవరం సోమారామంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు


విద్యుత్‌కాంతుల్లో పాలకొల్లు క్షీరారామ రాజగోపురం


పాలకొల్లు క్షీరారామంలోని క్యూలైన్లలో భక్తుల రద్దీ

స్థానికులతో పాటు అధిక సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకుంటున్నారు. గత వారంలో సాధారణ రోజుల్లో భక్తుల రద్దీ నాలుగు నుంచి ఆరు వేల వరకు ఉంటే కార్తీక సోమవారం 35 వేల మందికి పైగా దర్శించుకున్నారని అంచనా. వీరిలో పంచారామ యాత్రికులు 25 వేలకు పైగా ఉంటారని అధికారులు అంటున్నారు. సాధారణ రోజుల్లో దర్శన టిక్కెట్లు, సేవల రూపంలో రూ. మూడు నుంచి ఐదు వేలు వరకు ఆదాయం వస్తే గత సోమవారం సోమారామంలో రూ. ఆరు లక్షలు, క్షీరారామంలో రూ. 4.5 లక్షల వరకు ఆదాయం వచ్చింది. యాత్రికుల్లో అధికశాతం మంది మహిళలు, అయ్యప్ప, శివ మాలధారులు ఉంటున్నారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణ నుంచి పంచారామ యాత్రికులు తరలివస్తున్నారు. కార్తీక సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిపోల నుంచి ఆర్టీసీ నడుపుతున్న పంచారామ స్పెషల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, వాహనాల్లో ఆలయాలకు చేరుకుంటున్నారు.

నిత్యాన్నదానం

కార్తీకమాసం నెలరోజులు రెండు ఆలయాల వద్ద భక్తులకు నిత్యాన్నదాన సదుపాయం ఏర్పాటు చేశారు. సాధారణ రోజుల్లో భీమవరంలో ఐదు వేల మంది వరకు ప్రత్యేక పర్వదినాల్లో 20 వేల మంది వరకు, పాలకొల్లులో ప్రతీ రోజు మూడు వేల మందికి, ప్రత్యేక పర్వదినాల్లో 15 వేల మంది వరకు భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేశారు. సోమారామంలో భక్తులకు నిత్యాన్నదానం కోసం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ 100 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు.

భక్తుల కోసం ప్రత్యేక వసతులు



కార్తీకమాసంలో యాత్రికుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రత్యేక పర్వదినాల్లో 25 వేలకు పైగా భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు, అన్నదానం, ఇతర వసతులు కల్పించాం.

– డి.రామకృష్ణంరాజు, సోమారామం ఈఓ, భీమవరం

ఏర్పాట్లు బాగున్నాయి



పంచారామ యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా వచ్చాం. భీమవరం, పాలకొల్లులో ఆలయాలను సందర్శించి స్వామివార్లను దర్శించుకున్నాం. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు బాగా చేశారు.

– అప్పలనాయుడు, పార్వతీపురం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

వేల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు రెండు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి ఉచిత దర్శనం, రూ. 50, రూ.100 ప్రత్యేక దర్శనాలు కల్పించారు. సాధారణ రోజుల్లో ఉదయం ఆరు గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతిస్తే ప్రస్తుతం పంచారామ యాత్రికుల సౌలభ్యం కోసం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే దర్శనం కల్పిస్తున్నారు. స్వామికి అభిషేకాలు, కార్తీక నోములు నోచుకునే భక్తులకు సోమారామంలో ఆలయం వెనుక ఏర్పాట్లు చేశారు. వాహనాలకు జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించి అక్కడి నుంచి ఆలయం వరకు రానుపోనూ భక్తులకు ఉచిత ఆటో సర్వీసులు నడుపుతున్నారు. క్షీరారామంలో వేకువజామున కార్తీక దీపాలు వెలిగించేందుకు, దీప, ఉసిరి, సాలగ్రామ, వస్త్ర, గోదానాలు ఇచ్చే భక్తుల కోసం ఆలయ ఉత్తర భాగంలో గోశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వెనుక ఖాళీ స్థలం, మార్కెట్ రోడ్డు, మార్కెట్‌యార్డు వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఈ నెల 27, డిసెంబరు 4, 11 తేదీల్లో కార్తీక సోమవారాలు, ఈ నెల 26, డిసెంబరు 3, 10 తేదీల్లో ఆదివారాలు, 24 శుక్రవారం శిల్క్ ద్వాదశి, 27 సోమవారం కార్తీక పౌర్ణమి రావడంతో ఆయా ప్రత్యేక రోజుల్లో భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన చింతలపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చింతలపూడి: చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15న శృంగవృక్షంలో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్ 17 కబడ్డీ పోటీల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.శివచంద్ర, వి.కౌషిక్ నాయుడు, జె.ఉదయ్‌లు రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వి మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

యువతి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: ప్రేమ వివాహానికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలోని టిడ్కో గృహాల్లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం టిడ్కో గృహాల్లో ఉంటున్న భారతి(21) పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తుంది. భారతి ఓ అబ్బాయితో గత కొంతకాలంగా ప్రేమలో పడింది. ఈ విషయాన్ని తల్లికి చెప్పగా ఒప్పుకోలేదు. దాంతో మనస్తాపానికి గురైన యువతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ డి.రాంబాబు పర్యవేక్షణలో ఎస్సై ఎస్ ముత్యాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం


రైళ్లలో దొంగతనాలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీహరిబాబు, ఆర్పీఎఫ్ సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా దొంగను పట్టుకున్నారు. అతని నుంచి సుమారు రూ. 3.5 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలోని సంజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన అనంత దుర్గారావు పలు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పోలీసులు మంగళవారం సాయంత్రం గూడెంలోని ఓవర్‌బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేశారు. అతని నుంచి గుడివాడ, రాజమండ్రి, భీమవరం, నిడదవోలు, తాడేపల్లిగూడెం జీఆర్పీ కేసులకు సంబంధించి ఎనిమిది ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్, ఐపాడ్, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి విజయవాడ ఏడో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా బుధవారం 14 రోజులు రిమాండ్ విధించినట్టు చెప్పారు.

కాల్వలో దూకి బాలిక ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న బాలిక తేజస్వి

తణుకు: తణుకు పట్టణానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలిక మంగళవారం రాత్రి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిల్వర్‌జూబ్లీ రోడ్డులోని గ్రీన్ మెడోస్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న గుడివాడ తేజస్వి(15) పదో తరగతి చదువుతోంది. మంగళవారం రాత్రి తల్లి గుడివాడ వెంకటనాగలక్ష్మి ఇంట్లో పని చేయమని చెప్పడంతో మనస్తాపం చెందిన తేజస్వి ఇంట్లో ఉన్న తల్లి, తమ్ముడిని బయట గడియ పెట్టి వెళ్లి గోస్తనీలో దూకేసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి కాల్వలో మృతదేహాన్ని గుర్తించారు.

యండగండిలో కీచక టీచర్

ఉండి: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినికి మాయమాటలు చెప్పి మోసగించాడు. ఆమె బుధవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికను ఆ స్కూల్లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వ్యక్తి ప్రేమపేరుతో మోసగించాడు. ఈ నెల 19న బాలికను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని భీమవరం రూరల్ మండలంలోని తాడేరులో తన ఇంటికి తీసుకువెళ్లి ఇంట్లోనే పెళ్ళి చేసుకున్నాడు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డాడు. తనను ఉపాధ్యాయుడు మోసగించాడని గ్రహించిన ఆ బాలిక అతని నుంచి తప్పించుకుని 22న తండ్రి వద్దకు చేరింది. తండ్రి సాయంతో ఉండి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాలిక ఫిర్యాదుపై పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎస్.మురళీకృష్ణను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా ఎస్పీ నియమించినట్లు తెలిపారు.

గూడెంలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు


ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 16, 17 తేదీలలో రెండు రోజుల పాటు ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు తాడేపల్లిగూడెంలో బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని వేదిక సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద ఆయనతో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరింపజేశారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో సాహిత్య సేవలు అభినందనీయమన్నారు. వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేస్తున్న సేవలను కొనియాడారు. జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి మాట్లాడుతూ పట్టణంలో జరిగే కళా ఉత్సవాలలో సాహిత్య చరిత్రలో 24 గంటల పాటు నాన్ స్టాప్‌గా కళా ప్రదర్శనలు, వివిధ పుస్తక ఆవిష్కరణలు, సాహిత్య సదస్సులు జరుగుతాయని, 5 వేల మంది కవులు, కళాకారులు పాల్గొంటారని, ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు. బ్రోచర్‌లు ఆవిష్కరణలో జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ టి.పార్థసారధి, జాతీయ కార్యదర్శి రిషి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, బొడ్డు సాయి బాబా, గారపాటి వీరకుమార్, రాజా త్రినాథ్, కర్రి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ద్వితీయ స్థానంలో నిలిచిన అండర్ 14 బాలికల, బాలుర పశ్చిమ జట్లు




నెట్‌బాల్ పోటీల్లో విజయం

పాలకోడేరు: కృష్ణా జిల్లా విజయవాడలోని స్టెల్లా మేరీ కాలేజీలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ అండర్ -14, అండర్-19 బాల బాలికల పోటీలలో పశ్చిమగోదావరి జిల్లా ప్రతిభ చూపింది. అండర్ -14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, అండర్ 14 బాలికల విభాగంలో ద్వితీయ, అండర్ 19 బాలుర విభాగంలో తృతీయ స్థానం, అండర్ 19 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించాయని పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు తెలిపారు. ఈ జట్లకు కోచ్ మేనేజర్లుగా పి.దావూద్ ఖాన్, ఎస్.విజయలక్ష్మి, పి.శ్రీనివాసు, విజయ్ కుమార్ వ్యవహరించారు.

నేత్రపర్వంగా మద్ది అంజన్న గ్రామోత్సవం




కోలాట నృత్యం నడుమ అశ్వవాహనంపై మద్ది ఆంజనేయ స్వామి గ్రామోత్సవం, ఊరేగింపు రథంలో కొలువై ఉన్న స్వామి వారు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై కోలాట నృత్య ప్రదర్శన, కేరళ నృత్య ప్రదర్శన నడుమ స్వామి వారి ఊరేగింపు సాగింది. స్వామి క్షేత్రం నుంచి గురవాయిగూడెం పురవీధుల గుండా ఊరేగింపుగా వచ్చిన స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన


ఉజ్వల్ పథకంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న కేంద్ర సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి

భీమడోలు : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇతర రాష్ట్రాల కన్నా జిల్లా ప్రజల్లో పూర్తి అవగాహన ఉందని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి అన్నారు. జిల్లాలో వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహణ ఏర్పాట్లపై భీమడోలు పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమా నందూరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల అవగాహనపై సంతృప్తి వ్యక్తం చేసారు. వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ఉజ్వల్ కనెక్షన్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించేందుకు మంచి ఏర్పాట్లు చేసిన సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, డీపీవో తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్‌ను అభినందించారు. జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ వివిధ వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గత నాలుగున్నర సంవత్సరాల్లో అర్హులైన లబ్దిదారులందరూ ప్రయోజనం పొందారన్నారు. జిల్లాలోని 547 పంచాయతీల్లో సంకల్ప యాత్రకు ఏర్పాట్లు చేశామన్నారు. తొలుత ఉమా నందూరికి కమిటీ ఘన స్వాగతం పలికింది. కూచిపూడి, జానపద నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర పథకాలపై అవగాహన, వాటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, జెడ్పీ సీఈవో సుబ్బారావు, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, సర్పంచులు గుడివాడ నాగ గౌతమి, ఏపూరి భానుదీపిక, దాయం సుజాత, నీలం శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



గడపగడపకు సంక్షేమం

ఆకివీడు : అయిభీమవరం గ్రామంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు

తక్కువ ఖర్చుతో వ్యవసాయం

గణపవరం: రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేసి లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం అప్పనపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సార్వా పంట పూర్తవడంతో రైతులు దాళ్వాపై దృష్టి సారించాలని అన్నారు. రైతులు వెదజల్లే పద్ధతిపై దృష్టి సారించాలని, ఈ పద్ధతివల్ల ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ ఆదా చేసుకోవచ్చునని సూచించారు.

క్లుప్తంగా

కృషి, పట్టుదలతో క్రీడల్లో రాణించాలి

తాడేపల్లిగూడెం రూరల్: కృషి, పట్టుదలతో క్రీడల్లో రాణించాలని దండగర్ర జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఊబా వెంకటేష్‌ను బుధవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిరోజూ కొంతసమయం క్రీడలకు కేటాయించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వ్యాయామోపాధ్యాయుడు బి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన

తణుకు టౌన్: వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తణుకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.వెంకట రమణ కోరారు. ప్రత్యే ఓటు నమోదు అవగాహనా కార్యక్రమం (స్వీప్)లో భాగంగా బుదవారం తణుకు పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇరగవరంలో..

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో బుధవారం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం ఎస్‌వీఈఈపీను నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ విద్యార్థులకు ఓటు హక్కు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమలో అధికారులు బి.వెంకటేశ్వరరావు, వరప్రసాద్, ఎం.సత్యవేణి పాల్గొన్నారు.

పీఆర్ 126 వరి వంగడాన్ని కొనసాగించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, పీఆర్ 126 వరి వంగడాన్ని కొనసాగించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయూ నాయకులు సత్తి కోదండ రామిరెడ్డి, తేతలి నాగిరెడ్డి మాట్లాడారు. చీడపీడలను తట్టుకుని, వాతావరణ మార్పులను తట్టుకుని తక్కువ నీటితో పంటను అందించే వంగడం 126 అన్నారు. కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, ఆంజనేయులు, సుబ్బిరెడ్డి, వెంకట్రావు, నాని, కృష్ణ, పుత్రయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

10న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ

తణుకు టౌన్: విజయవాడలో రాష్ట్ర స్థాయి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ మహాసభను డిసెంబరు 10న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జేఏసీ చైర్మన్ ఎం సుబ్బారావు తెలిపారు. బుధవారం తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అసోసియేషన్ జిల్లా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిశంబరు 10న విజయవాడలో జరిగే అసోసియేషన్ ప్రథమ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేఏసీ వైస్ చైర్మన్ జె.మురళీ కృష్ణ, జిల్లా కార్యదర్శి గెద్దాడ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

26న గూడెం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ నందు 1976–77 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 26వ తేదీ ఆదివారం జరుగుతుందని బ్యాచ్ విద్యార్థులు ఇంజినీర్ పూరేటి సాయిరాజు, సీనియర్ న్యాయవాది బండారు మనోహర్, హిందుస్థాన్ పెట్రోలియం సీఈఓ కె.శ్రీనివాస్, హైదరాబాద్ స్టాక్ ఎక్స్చేంజ్ సభ్యుడు టి.శ్రీలు తెలిపారు. ఆనాటి గురువులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, కార్తీక మాసం సహపంక్తి భోజనాలు ఉంటాయని వెల్లడించారు.

రోగులకు సత్వర వైద్యసేవలు

అత్తిలి: ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్యసేవలు అందించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేయాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ కోరారు. బుధవారం అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశాలలో ఆసుపత్రులకు సంబంధించిన పలు తీర్మానాలు చేశారు. మంచిలి పీహెచ్‌సీలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించాలని ఎంపీడీఓ కోరారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అత్తిలి, కె.సముద్రపుగట్టు. మంచిలి గ్రామాల సర్పంచ్‌లు గంటా విజేత, బండి వెంకటలక్ష్మి, చింతా రామయ్య, వైద్యులు చాముండేశ్వరి, కె.నాగరాజు, ఎంపీడీఓ ఎండీ అమీలుజమా, వైస్ ఎంపీపీ దారం శిరీషా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాల మెరుగు



అత్తిలి: కొమ్మరలో బ్రోచర్‌లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఇరగవరం: పేకేరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్: మెట్ట ఉప్పరగూడెంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు

అత్తిలి: ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. బుధవారం సాయంత్రం అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైబోయిన వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేసి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి వై ఏపీ నీడ్స్ జగన్ బ్రోచర్‌లను అందజేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉప సర్పంచ్ మన్యం దానారావు, సొసైటీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరిరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, సత్తి గణేష్‌రెడ్డి, వెలగల సుదర్శనరెడ్డి, మద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకేరులో..

ఇరగవరం: మండలంలోని పేకేరు పంచాయతీలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డులను తణుకు ఎంపీపీ వెలగల సాయిబాబా రెడ్డి ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాత నాలుగున్నార సంత్సరాల పరిపాలనలో పేకేరు గ్రామంలో రూ. 3 కోట్ల 89 లక్షల 6 వేల 262 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొప్పిసెట్టి దుర్గాప్రసాద్, గ్రేడ్–1 కార్యదర్శి ఫణీంద్ర, సర్పంచ్ బెల్లంకొండ హేమ లత, ఎంపీటీసీ సభ్యుడు దొమ్మెటి శ్రీనివాస్, దినేష్ రెడ్డి, నాయకులు చింతా బాపిరెడ్డి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్, సొసైటి అధ్యక్షుడు సత్తి సత్తిబాబు పాల్గొన్నారు.

వేల్పూరులో..

తణుకు టౌన్: రాష్ట్రంలో పాఠశాలలు అభివృద్ధి చేసి పేద పిల్లల భవిషత్ తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి కావాలని తణుకు మండల పరిషత్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీ రుద్రా ధనరాజు చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని 4వ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, విజయ దుర్గ, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి పాల్గొన్నారు.

తణుకు పట్టణంలో..

తణుకు అర్బన్: కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా సంక్షేమ పథకాలన్నీ అందరికీ అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. తణుకు 23వ వార్డులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డులో జెండా స్థూపాన్ని ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నాయకులు రేలంగి రాంబాబు, కుడుపూడి చంద్రరావు, పుల్లెపు సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకే సాధ్యం

పెంటపాడు: పేదల అభివృద్ధి, సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యమని తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి అన్నారు. పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం పార్టీ బీసీ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఏమీ చేయని ప్రతిపక్ష నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు జగనన్న చేస్తున్న అభివృద్ధికి వక్రభాష్యాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. నేడు ప్రజలంతా జగన్ వైపు ఉన్నారన్న అక్కసుతో పలు కుట్రలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. ప్రజలు ఇవన్నీ గ్రహిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో నూటికి నూరు శాతం ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం వద్ద పథకాల లబ్ధిని తెలిపే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుదుళ్ల భాస్కరరావు, గుమ్మళ్ల రత్నరాజు, మీసాల మోషేన్, ఉప సర్పంచ్ చెరకు సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ ప్రసాద్, శివారెడ్డి, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు పార్టీ నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం గృహసారథులకు బ్యాగులు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, గృహసారథులతో కలిసి బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

గూడెం 13వ వార్డులో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని స్థానిక 13వ వార్డులో బుధవారం ఇన్‌చార్జి తెన్నేటి జగ్జీవన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డులో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వెల్లడించారు. ఆర్థిక లబ్ధిని లబ్ధిదారులు, ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గుండుబోగుల నాగు, నాయకులు కొలుకులూరి ధర్మరాజు, సచివాలయం కన్వీనర్ కర్రి భాస్కరరావులు మాట్లాడుతూ అనేక సంక్షేమాలను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 'వై ఏపీ నీడ్స్ కిట్లు' అందజేశారు. బోనం విజయ నిర్మల, దింటకుర్తి లీలావతి, బొద్దాని శ్రీను, చామన సూర్యచంద్రరావు, గణపతి, నీరుకొండ పండు, మిద్దె ఆదినారాయణ, వార్డు సెక్రటరీలు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందానికి సంక్షేమ పథకాలు

తాడేపల్లిగూడెం రూరల్: పేదల కళ్ళల్లో ఆనందానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ అవ్వాతాతలకు తెల్లవారకుండానే పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. పార్టీ నియోజకవర్గ యువ నాయకుడు కొట్టు విశాల్ మాట్లాడుతూ పరిపాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి కంకణబద్దులైన కొట్టు సత్యనారాయణను మళ్లీ గెలిపించాలని కోరారు. తొలుత సచివాలయం వద్ద రూ.23 కోట్ల 38 లక్షల 99వేల 956లు విలువైన సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించి, పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి రాష్ట్రానికి సీఎం జగన్ అవసరాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.



తణుకు టౌన్: వేల్పూరులోని 4వ సచివాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



తణుకు అర్బన్: 23వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



పెంటపాడు: జట్లపాలెంలో మాట్లాడుతున్న తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్



తాడేపల్లిగూడెం (టీఓసీ): 13వ వార్డులో మాట్లాడుతున్న కర్రి భాస్కరరావు

అన్ని గ్రామాలకు తాగునీరు



రేలంగిలో ఇంజనీర్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న డీఈ

ఇరగవరం: అన్ని గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తణుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో మూడు మండలల్లో 48 గ్రామాల్లో 80 కోట్ల రూపాయాలతో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కృషితో 200 కిలో మీటర్ల మేర పైపు లైన్‌లు ఏర్పాటు చేసి కొత్త కనెక్షన్స్ ఇవ్వడం పాత ట్యాప్‌లకి కంట్రోల్ వాల్స్ ఏర్పాటు చేస్తారు. ఇప్పటివరకు రూ.45 కోట్లకు విలువైన పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ రమేష్, కార్యదర్శి లక్ష్మీ నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు చేబ్రోలు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- గోపినాధపట్నంలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు మహోత్సవాలు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపినాధపట్నంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 27 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం ఆయన స్వగృహం వద్ద ఆహ్వాన పత్రికలను విడుదల చేసి మాట్లాడారు. తన తండ్రి కొట్టు వెంకటేశ్వరరావు 62 ఏళ్ళ క్రితం గోపినాధపట్నంలో ఆలయాన్ని నిర్మించారన్నారు. అప్పటి నుంచి కళ్యాణ మండపం, గీతా మందిరం, రామకోటి కృతువు, భగవత్ సంబంధిత విగ్రహాలు ఏర్పా చేసి పలు ఆలయాలను నిర్మించి అభివృద్ధి చేశామన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాతికట్టడంతో ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 3.37 గంటలకు మహాకృతువును ప్రారంభిస్తున్నామన్నారు. ఐదు రోజులపాటు శాంతి హోమాలు, ఆగమ శాస్త్రానుసారం దైవిక, భక్తి, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పండిత శ్రీమాన్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యాన వేద పండితులు అర్చక స్వాములు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 1వ తేదీన విగ్రహ పత్రిష్ఠ మంత్రి కొట్టు దంపతుల చేతుల మీదుగా నిర్వహిస్తారని, అనంతరం భారీ అన్నసమారాధన చేస్తారన్నారు. కార్యక్రమంలో కొట్టు విశాల్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, గార్లపాటి వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం

తణుకు అర్బన్: తణుకు రాయల్ టాకీస్ ప్రాంతంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి గణపతి హోమం నిర్వహించారు. పోలిశెట్టి గోపి నిర్మించిన ఈ ఆలయంలో ధర్మకర్త పోలిశెట్టి వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఈ హోమం వేద పండితుల మంత్రోచ్చరణముల మధ్య భార్గవ ఫణికుమార్ పర్యవేక్షణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నలుమూలల నుంచి వచ్చిన అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శంకర మఠంను దర్శించిన ఆదిత్యానంద స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శంకర మఠంను బుధవారం ఆదిత్యానంద శాస్త్రి స్వామి దర్శించారు. ఈ సందర్భంగా మఠంలోని చంద్రమౌళీశ్వర స్వామి, సర్వమంగళమ్మకు స్వామిజీ పూజలు చేశారు. మఠంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను స్వామిజీ పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలతో బలహీన వర్గాలకు మేలు

తాడేపల్లిగూడెం రూరల్: బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి మంత్రివర్గంలో స్థానం కల్పించడం దేశ చరిత్రలోనే తొలిసారి అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని దండగర్ర, ఆరుగొలను, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లోని దళితవాడల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉప్పరగూడెం గ్రామంలో జరిగిన సభకు సర్పంచ్ దండే కనకబాబు అధ్యక్షత వహించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకే మేలు చేకూరుతుందన్నారు. గూడెం నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేయాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాకే పండియ్య, మరపట్ల సుబ్బారావు, మరపట్ల రమేష్, రాపాక అప్పన్న, దొండపూడి ప్రసాద్, పంతగాని వినీల్, నత్తా మహేష్ దండే వెంకన్న, మరపట్ల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి



వేల్పూరులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి

తణుకు టౌన్: బాలికల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కేఎం రత్నకిషోర్ చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటి పడావో కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేల్పూరు పీహెచ్‌సీ వైద్యురాలు కె.సాయి భవాని, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు విప్పర్రులో..

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో బేటిబచావో–బేటి పడావ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. తూర్పు విప్పర్రులో తణుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం , బాలికల అభివృద్ధికి తోడ్పాడదాం అని పిలుపునిచ్చారు. గ్రామ కార్యదర్శి టి.దుర్గా ప్రసాద్, సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ, వీఆర్‌ఓ పి.రామాలింగేశ్వరరావు పాల్గొన్నారు.

వేల్పూరులో..

తణుకు: మండలంలోని వేల్పూరు గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ ఆడపిల్లల చదువు ఆవశ్యకత గురించి వివరించారు.

బాలిక విద్య ఇంటికి వెలుగు

తాడేపల్లిగూడెం రూరల్: బాలిక విద్య ఇంటికి వెలుగునిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. ఆడపిల్లల్ని రక్షిద్దాం – ఆడపిల్లల్ని చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మాధవరం, ఆరుగొలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆడపిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయరాదని సూచించారు. అనంతరం లింగ నిష్పత్తి వ్యత్యాసం, పౌష్టికాహారం, బాలికల్లో డ్రాప్ అవుట్స్ నివారణ వంటి అంశాలపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లులకు అవగాహన తప్పనిసరి

పెంటపాడు: యుక్త వయస్సు రాకుండా బాల్య వివాహాలు చేస్తే మహిళల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయని, బాలికలను రక్షించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, విజయలక్ష్మి అన్నారు. పెంటపాడులో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికల తల్లులకు అవగాహన కల్పించారు. కిశోర్ బాలికలకు డ్రెస్‌కోడ్‌పై వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. బాలికల అక్రమ రవాణా పై వివరించారు. ర్యాలీలు నిర్వహించి మండల కార్యాలయం వద్ద సమావేశాలు నిర్వహించారు.

పెంటపాడు మండలాన్ని ఆదర్శంగా నిలపాలి

పెంటపాడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పెంటపాడు మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నడపాలని గూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ కోరారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దాసరి హైమావతి అధక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంపత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు ఎన్నో పథకాలు అందుతున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు గ్రామాల అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలన్నారు. సమావేశానికి సకాలంలో అధికారులు రాకపోవడంపై ఏఎంసీ చైర్మన్ అసహనం వ్యక్తం చేసారు. జెడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు తదితరులు మాట్లాడారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట్రావు, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ, ఏఈలు నవీన్, పార్ధసారధి, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు, పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్‌ను సభ్యులు సన్మానించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

అత్తిలి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు భవనంలో బల్లంకి శ్రీనివాస్, దుర్గా గాయత్రీ దంపతులు కలశస్థాపన చేసారు. స్వామివారి చిత్రపటాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. క్రొవ్విడి వెంకన్నబాబు అర్చకత్వంలో పూజాధికాలను జరిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పట్నాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి, బల్లంకి ఆచారి, పట్నాల నాగరాజు, ముదపాక బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాముని అక్షతలతో శోభాయాత్ర

అత్తిలి: అయోధ్య శ్రీ రామచంద్రుని కల్యాణానికి సంబంధించిన అక్షతలతో విశ్వహిందూ పరిషత్ సభ్యులు బుధవారం అత్తిలి మండలంలో శోభాయాత్ర నిర్వహించారు. కాషాయ జెండాలతో శ్రీరామ నామాన్ని ధ్యానిస్తూ గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. రామాలయాల వద్ద అక్షతలు ఉన్న పవిత్ర పాత్రలను ఉంచి భక్తులకు శ్రీరామచంద్రుని అక్షితలను ప్రసాదంగా అందజేశారు.

సాక్షి ఫ్యామిలీ
IV
తాడేపల్లిగూడెం
గురువారం ॥ 23-11-2023



త్రిష



మన్సూర్ అలీఖాన్

✻ సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు. డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు. పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు. ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్. సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి. వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది. అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త

అతడో ప్రసిద్ధ నటుడు. ‘మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు’ అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీల మైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు ‘స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?’ అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ ‘స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి’ అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు, అంటే వాళ్లు పడతారు, అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో ‘లియో’ సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ‘ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను’ అని వ్యాఖ్యానించాడు. ‘ఇది సినిమా లాంగ్వేజ్’ అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. ‘ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను’ అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు ‘సరదాగా మాట్లాడుతున్నామని’ అను కుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపర చడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు ‘మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి’ అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ ‘సుల్తాన్’ సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి ‘ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు’ అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

బాల్యం నుంచి భావజాల ప్రభావం

‘కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం’ అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని ‘మీరు’ అని, తల్లిని ‘నువ్వు’ అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా ‘నువ్వు’ అనడం వల్ల ‘లెక్క చేయవలసిన పని లేదు’ అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడ వచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా ‘మేమేమీ గాజులు తొడుక్కోలేదు’, ‘మూతి మీద మీసముంటే రా’లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుక బాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త.

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ... ఆ తరువాత మాత్రం ‘ఎవరీ అమ్మాయి?’ అనుకున్నారు చాలామంది. గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు... ఉర్మిళా రోసారియో. ఎవరీ ఉర్మిళ?

అవును... మన అమ్మాయే!





తల్లిదండ్రులతో ఉర్మిళ



వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఉర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఉర్మిళ జన్మించింది.

ఉర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఉర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్–ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఉర్మిళ పని తీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఉర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

‘క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది’ అని నవ్వుతూ అంటుంది ఉర్మిల.

నవ్వడం సరే,
క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?
ఒక్కమాటలో చెప్పాలంటే...
‘రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్’
దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఉర్మిళ.

ఉర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఉర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా ‘ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం’ అంటున్నారు ఉర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?
ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఉర్మిళ వస్తుంది కదా!
ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!!

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.



భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్లు నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.

ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్– ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో ‘జాయిన్ మై వెడ్డింగ్’ పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి.

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.” ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది” అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...



- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.
- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి.





ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు. వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం... అనే నియమాలేవీ లేవు. నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు. ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...



హేమా సర్దా



కొన్ని సంవత్సరాల క్రితం... దిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో ‘బ్యాంబు అండ్ బంచ్’ రూపంలో డైరెక్ట్–టు–కన్జ్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా. అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రొడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

‘అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను’ అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

‘నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం’ అంటుంది హేమా సర్దా.